ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017


సేలం బహిరంగ సభలో ప్రజలకు మోదీ అభివాదం

డీఎంకే... కాంగ్రెస్ దొందూదొందే

- అవినీతి కుటుంబ పార్టీలవి
- జయను ఎలా అవమానించారో దేశం మొత్తానికి తెలుసు
- సేలంలో సభలో మోదీ ధ్వజం
- వేదిక పంచుకున్న ఓపీఎస్, దినకరన్, రాందాస్, శరత్‌కుమార్

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కాంగ్రెస్ పార్టీలు రెండు పార్శ్వాలు కలిగిన ఒకే నాణెం వంటివని, అవినీతికి, కుటుంబ పాలనకు నిదర్శనాలని నరేంద్రమోదీ ధ్వజమెత్తారు. సేలంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఎన్డీయే కూటమి ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ... ఎన్డీయే ప్రభుత్వం 5జీని ప్రవేశపెడితే, డీఎంకే రాష్ట్రంలో ఐదో తరానికి పట్టం కట్టేలా కొత్త 5జీని అమలు చేయడానికి సిద్ధంగా ఉందని విమర్శించారు. ఇక 2జీలో డీఎంకే నేతల అవినీతి చిట్టా విప్పాలంటే రోజంతా చాలదన్నారు. కేంద్ర నిధులను డీఎంకే ప్రభుత్వం లూటీ చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. మహిళలంటే ఎంతటి చులకనో తమిళనాట జరిగిన ఓ సంఘటనే సాక్ష్యం చెబుతుందని, మాజీ ముఖ్యమంత్రి జయలలితపట్ల ఆ నేతలు ఎలా ప్రవర్తించారో దేశ ప్రజలందరికీ తెలుసన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును సైతం ఇండియా కూటమి నేతలు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. ప్రస్తుతం మహిళా శక్తికి ఎన్డీయే రక్షణ కవచంగా ఉంటుందని సభికుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. తమిళనాడుకు చెందిన కాంగ్రెస్ దివంగత నాయకుడు జీకే మూపనార్ జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పారని, ప్రధాని పదవి ఆయనను వెదుక్కుంటూ వస్తే డీఎంకే నాయకులు అడుగడుగునా అడ్డుకున్నారని విమర్శించారు. ఇక నిరాడంబర, నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం కామరాజరే రాజకీయాల్లో తనకు స్ఫూర్తి అని, బడి పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించి పేదపిల్లలకు విద్యావకాశం అధికం చేసిన మహానాయకుడని కొనియాడారు.

వెంటాడుతున్న సేలం జ్ఞాపకాలు...

నలభై యేళ్లకు ముందు తనతోపాటు కైలాస మానసరోవర్ యాత్రలో పాల్గొన్న సేలంకు చెందిన రత్తినవేల్ గుర్తుకు వస్తున్నారని, ఆయన సేలం నగరం గొప్పదనాన్ని వివరించాడని చెప్పారు. ఆ యాత్ర ముగించుకుని సేలంలో రెస్టారెంట్ నడిపిన రత్తినవేల్ ప్రమాదంలో మృతి చెంది తనకు తీరని శోకాన్ని కలిగించాడన్నారు. ఇదే విధంగా సేలంకు చెందిన మాజీ బీజేపీ నేత దివంగత కేఎన్ లక్ష్మణ న్‌తో తనకున్న ఆత్మీయ అనుబంధం కూడా మరచిపోలేనని చెప్పారు. సేలం నగరంలో తాను కాలు మోపగానే పార్టీని అభివృద్ధి చేసిన ఆడిటర్ రమేష్ గుర్తుకు వచ్చారన్నారు. పార్టీ కోసం రాత్రనకా పగలనకా పాటుపడిన ఆడిటర్ రమేష్ దారుణహత్యకు గురయ్యారని, ఈ సభ ద్వారా ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నానని మోదీ అన్నారు.

ప్రాచీన భాష తమిళమే...

ప్రపంచంలో అత్యంత ప్రాచీనమైన భాష తమిళమేనని మోదీ అన్నారు. తమిళభాషలో మాట్లాడలేకపోతున్నాననే బాధను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తనకు ఊరట కలిగిస్తోందని, ఆ మేరకు తన ఎక్స్ పేజీ నమోదాట్ ఇన్ ద్వారా తన ప్రసంగాన్ని తమిళంలో అందరూ వినే సదుపాయం అందుబాటులోకి తెచ్చానని చెప్పారు. నాలుగైదు నెలల పాటు సేలంలో మకాం పెడితే తమిళభాషను నేర్చుకోగలనని చమత్కరించారు. కోయంబత్తూరు రోడ్‌షోకు ప్రజల నుండి లభించిన అపూర్వ స్పందన తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. మోదీ ఈ సభలో పాల్గొనే నిమిత్తం కేరళలోని పాలక్కాడు నుంచి హెలికాప్టర్‌లో విచ్చేశారు. హెలిపాడ్ నుండి ఓపెన్‌టాప్ కారులో నిలిచి ఇరువైపులా గుమికూడిన పార్టీ శ్రేణుల వైపు అభివాదం చేసుకుంటూ గెజలనాయకన్‌పట్టి సభావేదిక ప్రాంతానికి చేరుకున్నారు. ఆ సమయంలో మాజీ సీఎం ఓపీఎస్ తన ప్రసంగాన్ని నిలిపివేసి సీటులో కూర్చున్నారు. వేదికపై పీఎంకే నేతలు రాందాస్, అన్బుమణి రాందాస్, జీకే మణి, ఐజేకే నేతలు పారివేందర్, రవి పచ్చముత్తు, మహిళా మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్, ఏఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్, జాన్‌పాండ్యన్, నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ, శరత్‌కుమార్ తదితరులు ఆసీనులయ్యారు. ఈ సభలో వ్యాఖ్యాతగా మాజీ ఎంపీ కేపీ రామలింగం వ్యవహరించారు. ఇక ఆయన ఓపీఎస్‌ని అన్నాడీఎంకే నేతగా పేర్కొనడంతో సభలో కాసేపు కలకలం ఏర్పడింది. సగ్గుబియ్యంతో కూడిన వెండిపాత్రను, అర్ధనారీశ్వర విగ్రహాన్ని, కరూరులో తయారైన బెడ్‌షీట్‌ను మోదీకి కానుకగా ఇచ్చారు. పీఎంకే నేతలు రాందాస్, అన్బుమణి రాందాస్ మోదీని శాలువతో సత్కరించారు.


మోదీని శాలువతో సత్కరించి ఆలింగనం చేసుకుంటున్న రాందాస్

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేతో దోస్తీకి ఆఖరి వరకూ దోబూచులాడిన పీఎంకే.. చివరికి బీజేపీతో దోస్తీ కట్టింది. ఎన్డీయే కూటమిలో చేరడంతో పాటు 10 స్థానాలను చేజిక్కించుకుంది. దిండివనం తైలాపురం గార్డెన్‌లో పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్ ఇంట్లో మంగళవారం ఉదయం ఇరు పార్టీల నేతల సమక్షంలో సీట్ల సర్దుబాట్ల చర్చలు చకచకా జరిగాయి. సోమవారం రాత్రే బీజేపీతో పీఎంకే పొత్తు కుదుర్చుకోవడం ఖాయమైపోయింది. ఆ మేరకు పీఎంకే ప్రధాన కార్యదర్శి వడివేల్ రావణన్ రాత్రి 8 గంటల సమావేశంలో ప్రకటించారు. ఆ ప్రకటనతో సేలం సభ ఏర్పాట్లలో తలమునకలైన బీజేపీ నాయకుల సంతోషానికి పట్టపగ్గాలు లేకపోయింది. సోమవారం రాత్రి బీజేపీ నేతలు దిండివనం తైలాపురం గార్డెన్‌కు చేరుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ ఇతర నాయకులకు

బీజేపీతో పీఎంకే జట్టు

- ఎన్డీయే కూటమిలో 10 సీట్ల కేటాయింపు


తైలాపురం గార్డెన్‌లో రాందాస్, అన్బుమణి రాందాస్‌తో అన్నామలై, ఎల్.మురుగన్ తదితరులు

పీఎంకే నేతలు రాందాస్, అన్బుమణి రాందాస్, జీకే మణి తదితరులు సాదరంగా ఆహ్వానించారు. అల్పాహారం అనంతరం సీట్ల పంపకంపై చర్చించారు. పావు గంటలోపే పీఎంకేకు పది లోక్‌సభ స్థానాలు కేటాయించారు. అప్పటికే సిద్ధం చేసుకున్న పత్రాలపై పీఎంకే నేత రాందాస్, బీజేపీ రాష్ట్ర చీఫ్ అన్నామలై సంతకాలు చేశారు. ఆ తర్వాత అన్బుమణి, అన్నామలై విలేఖరుల సమావేశంలో పాల్గొని రెండు పార్టీల మధ్య కుదిరిన పొత్తు వివరాలను ప్రకటించారు. రాష్ట్రంలో ఆరు దశాబ్దాలుగా సాగుతున్న రెండు పార్టీల పాలనకు దీటుగా కొత్త కూటమి ఉదయించిందని, 2026 శాసనసభ ఎన్నికల్లో మార్పును ఈ కూటమి తీసుకువస్తుందని అన్నామలై అన్నారు. అన్బుమణి రాందాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త మార్పును తీసుకురావాటానికే ఎన్డీయేలో చేరినట్లు ప్రకటించారు. సీట్ల సర్దుబాట్ల చర్చలు ముగియగానే బీజేపీ నేతలు, పీఎంకే నేతలు సేలంలో జరుగనున్న ప్రధాని నరేంద్రమోదీ సభలో పాల్గొనేందుకు ఆగమేఘాలపై తరలివెళ్లారు. ఇదిలా ఉండగా ఎన్డీయే కూటమిలో చేరిన పీఎంకేకు ధర్మపురి, సేలం, విల్లుపురం, మైలాడుదురై, కడలూరు, చిదంబరం, ఆరణి, అరక్కోణం, దిండుగల్ నియోజకవర్గాలు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. సేలం నియోజకవర్గంలో అన్బుమణి రాందాస్ సతీమణి సౌమ్యా పోటీ చేస్తారని పీఎంకే వర్గాలు చెబుతున్నాయి.


స్టాలిన్‌ను సత్కరిస్తున్న దురైవైగో తదితరులు

స్టాలిన్‌తో వైగో, ముత్తరసన్ భేటీ

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఎండీఎంకే నేత వైగో, సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్ అరివాయలంలో మంగళవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీపీఐ తరపున తిరుప్పూరులో పోటీ చేస్తున్న సుబ్బరాయన్, నాగపట్టినంలో పోటీ చేస్తున్న వై సెల్వరాజ్ స్టాలిన్‌ను శాలువతో సత్కరించి ఆయన ఆశీస్సులందుకున్నారు. ఇదే విధంగా తిరుచ్చిలో పోటీ చేయనున్న తన తనయుడు దురై వైగోను వెంటబెట్టుకుని ఎండీఎంకే నేత వైగో అరివాలయానికి వెళ్లి స్టాలిన్‌తో భేటీ అయ్యారు. ఈసందర్భంగా దురైవైగో స్టాలిన్‌ను శాలువతో సత్కరించారు. అటు పిమ్మట అరివాలయం వెలుపల వైగో మీడియాతో మాట్లాడుతూ.. మోదీ ఐదుసార్లు కాదు యాభైసార్లు రాష్ట్రంలో పర్యటించినా బీజేపీ కూటమికి ఓట్లు రాలవన్నారు. ఈ ఎన్నికల్లో పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి అభ్యర్థులు గెలవడం ఖాయమన్నారు. సీపీఐ నేత ముత్తరసన్ మాట్లాడుతూ... మోదీ కోయంబత్తూరు రోడ్‌షోలో ఎన్నికల నిబంధనలను ఉల్లఘించారని, ఆ రోడ్‌షోలో బడిపిల్లలను బలవంతంగా పాల్గొనేలా చేశారన్నారు. స్టాలిన్ నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న డీఎంకే పాలనను ప్రజలంతా మెచ్చుకుంటున్నారని, ప్రత్యేకించి మహిళలకు డీఎంకే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కంకణం కట్టుకున్నారని తెలిపారు.

నోటాతో పోటీపడితే గొప్పే!

- తమిళిసైపై సెల్వపెరుందగై సెటైర్లు

పార్రీస్, మార్చి 19: మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ తమిళనాడులో బీజేపీ తరపున పోటీ చేస్తే నోటా కంటే తక్కువ ఓట్లు వస్తాయని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై చమత్కరించారు. స్థానిక రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో కాంగ్రెస్ మాజీ ఎంపీ, సీనియర్ నేత కుమరి అనంతన్ 92వ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో వీజీపీ గ్రూప్ సంస్థల అధినేత వీజీ సంతోషమ్, సమత్తువ మక్కల్ కళగం అధ్యక్షుడు ఎర్నావూర్ నారాయణన్ సహా కాంగ్రెస్ నేతలు కేవీ తంగబాలు, ఈవీకేఎస్ ఇళంగోవన్, తిరునావుక్కరసు, ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు పెద్దసంఖ్యలో పాల్గొని కుమరి అనంతన్‌కు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలకు అధ్యక్షత వహించిన సెల్వపెరుందగై మీడియాతో మాట్లాడుతూ... నరేంద్ర మోదీ నియంతగా దేశాన్ని పాలిస్తున్నారని, రాహుల్ గాంధీ చేపట్టిన రెండు పాదయాత్రల వల్ల ప్రజల్లో బీజేపీపై నమ్మకం సన్నగిల్లిందన్నారు. ఎలక్టోరల్ బాండ్ల మోసంపై ప్రధాని మోదీ ఇప్పటివరకు నోరు మెదపలేదని, బీజేపీకి సంబంధించిన అవినీతి గురించి కాంగ్రెస్ తరపున ప్రచారం చేపడతామన్నారు. మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ తమిళనాడులో పోటీచేస్తే నోటా కంటే తక్కువ ఓట్లు మాత్రమే రాబట్టుకుంటారని అన్నారు. తమిళనాడు, పుదుచ్చేరిలో పోటీ చేయనున్న ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలు ప్రచారంలో పాల్గొంటారని, త్వరలో ఆ తేదీలు ప్రకటిస్తామని సెల్వపెరుందగై తెలిపారు.


కుమరి అనంతన్‌ను సత్కరిస్తున్న నేతలు

నేటినుంచి నామినేషన్ల షురూ

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ఈనెల 20న బుధవారం ప్రారంభంకానుంది. 39 లోక్‌సభ నియోజకవర్గాల్లో నామినేషన్ల స్వీకరణకు ఆయా ప్రాంతాల్లో అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. ఉత్తర చెన్నై నియోజకవర్గంలో పోటీ చేయదలచిన అభ్యర్థులు ఓల్డ్ వాషర్‌మెన్‌పేట, నెం.62 బేసిన్ బ్రిడ్జి రోడ్డులోని ఎన్నికల అధికారి కట్టా రవితేజ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాలి. సౌత్ చెన్నై అభ్యర్థులు అడయారు, నెం 115 డాక్టర్ ముత్తులక్ష్మి రోడ్డులోని ఎన్నికల అధికారి ఎంబీ అమిత్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాలి. ఇదే విధంగా సెంట్రల్ చెన్నై అభ్యర్థులు షెనాయ్‌నగర్ నెం.36బీ పుల్లా అవెన్యూలోని ఎన్నికల అధికారి కేజే ప్రవీణ్‌కుమార్ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది. ఇదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్, కార్యాలయాలు, మున్సిపాలిటీ కార్యాలయాలలో ఎన్నికల అధికారులు నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈనెల 27వ తేదీ వరకు రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్లు స్వీకరించే అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకే అభ్యర్థి, ఆయన మద్దతుదారులు ప్రయాణించే వాహనాలను అనుమతిస్తారు. ఎన్నికల అధికారి కార్యాలయం లోపలకు అభ్యర్థి సహా ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారు. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఎన్నికల అధికారి కార్యాలయాల్లోకి సిబ్బందిని తప్ప ఇతరులెవరినీ అనుమతించరు. అభ్యర్థులు తమ నామినేషన్లతోపాటు రూ.25 వేలను డిపాజిట్‌గా చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 చెల్లించాలి. ఎస్సీఎస్టీ అభ్యర్థులు వారి కులధ్రువీకరణ పత్రాలను నామినేషన్‌తోపాటు సమర్పించాలి. అభ్యర్థులు ఎన్నికల ఖర్చుకోసం నామినేషన్ దాఖలు చేయడానికి రెండు రోజులకు ముందే బ్యాంక్ ఖాతాను ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి అభ్యర్థికి ఆయా నియోజకవర్గాలకు చెందిన పది మంది ఓటర్లు ప్రతిపాదన చేస్తూ సంతకాలు చేయాలి. అభ్యర్థులు ఇతర నియోజకవర్గాలకు చెందినవారైతే వారి నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి నుంచి ధృవీకరణ పత్రాన్ని తీసుకురావాలి. గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు పార్టీ గుర్తులు పొందటానికి అనువుగా పార్టీ అధిష్ఠానం నుంచి ఏ, బి ఫారాలు సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు నామినేషన్లతోపాటు తమ ఆస్తుల వివరాలను కూడా జత చేయాల్సి ఉంటుంది.

డీపీఐ లోక్‌సభ అభ్యర్థులు వీరే...

అడయార్, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల్లో డీపీఐ తరపున పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్ ప్రకటించారు. డీఎంకే కూటమిలో భాగస్వామిగా ఉన్న డీపీఐకు చిదంబరం, విల్లుపురం లోక్‌సభ స్థానాలను కేటాయించిన విషయం తెల్సిందే. ఇందులో చిదంబరం స్థానం నుంచి పార్టీ ప్రధాన కార్యదర్శి తిరుమావళన్, విల్లుపురం స్థానం నుంచి రవికుమార్ పోటీ చేయనున్నారు. ఈ సందర్భంగా తిరుమా విలేకరులతో మాట్లాడుతూ.. చిదంబరం స్థానం నుంచి ఆరోసారి పోటీ చేస్తున్నానని, ఈ దఫా కూడా ఓటర్లు గెలిపిస్తారన్న నమ్మకం ఉందన్నారు. అలాగే, విల్లుపురం స్థానం నుంచి తమ పార్టీ సీనియర్ నేత రవికుమార్ పోటీ చేస్తారన్నారు. గత పదేళ్ళుగా అధికారంలో ఉన్న బీజేపీ అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందన్నారు. నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచేసిందన్నారు. ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు కసితో సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాల్లో డీఎంకే కూటమి విజయభేరీ మోగించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.




ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రేమలత

ఏ కూటమి వైపో రేపు చెబుతా

- డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఏ కూటమిలో చేరాలనే విషయంపై ఈ నెల 21న అధికారికంగా ప్రకటిస్తానని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేయదలచిన ఆశావహుల నుంచి ఆమె దరఖాస్తులు స్వీకరించారు. ఆ సందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి తమ పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు. ఏ పార్టీతో పొత్తు కుదుర్చుకోవాలనే విషయంపై ఈనెల 21న తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని ఆమె చెప్పారు.

ఎన్నికల భద్రతకు 1.70 లక్షలమంది పోలీసులు

- డీజీపీ శంకర్‌జివాల్



ప్యారీస్, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల భద్రతా విధుల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.70 లక్షల మంది పోలీసులు పాల్గొంటారని రాష్ట్ర డీజీపీ శంకర్‌జివాల్ పేర్కొన్నారు. మైలాపూర్‌లోని డీజీపీ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో 39 పార్లమెంటు నియోజకవర్గాల్లో 200 కంపెనీ పారామిలిటరీ బలగాలు భద్రతా విధుల్లో పాల్గొంటాయని తెలిపారు. వీరే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా మరో 1.70 లక్షల మంది పోలీసులు పాల్గొంటారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్ర సరిహద్దుల్లో పెద్ద మొత్తంలో నగదు, ఇతర వస్తువుల తరలింపు అడ్డుకొనేలా నిఘా ముమ్మరం చేసినట్టు చెప్పారు. ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద సీసీ కెమెరాలు అమర్చామని, ఆయా ప్రాంతాల్లో ఉన్న పోలీసులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో లైసెన్స్ పొందిన 13,000 తుపాకులు అప్పగించాల్సిందిగా యజమానులకు సూచించామన్నారు. అదేసమయంలో బ్యాంకుల భద్రతా విధుల్లో పాల్గొంటున్న సంస్థలకు, అలాగే వీఐపీలకు భద్రత కల్పించే పనుల్లో పాల్గొంటున్న సంస్థలకు తుపాకుల అప్పగింత నుంచి మినహాయించినట్లు తెలిపారు. వీరే కాకుండా 10,000 మందికి తుపాకుల అప్పగింతపై నోటీసు లు జారీ చేశామన్నారు. ఇక కార్పొరేషన్ల పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు ఆయా ప్రాంతాల్లో వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. వాహనాల్లో మాత్రమే కాకుండా రైళ్లలో పెద్ద మొత్తంలో నగదు తరలింపు అడ్డుకొనేలా చర్యలు చేపట్టేందుకు రైల్వే పోలీసులకు కూడా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం, రోడ్ షో, బహిరంగ సభల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి వచ్చే ప్రధాన రాజకీయ ప్రముఖులకు అవసరమైన భద్రత కల్పించాల్సిందిగా అన్ని జిల్లాల ఎస్పీలకు, పోలీసు అధికారులకు సర్క్యులర్ పంపినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో గంజాయి, కొకైన్ తదితర మత్తుపదార్థాలను తరలించే వారిని అరెస్ట్ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా శ్రీలంకకు సమీపంలో ఉన్న సముద్రతీర ప్రాంతాలకు మత్తు పదార్థాలు దిగుమతి చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని భారత కోస్ట్‌గార్డ్, ఎన్నికల పేరుతో రాష్ట్రంలోకి సరిహద్దుల ద్వారా ప్రవేశించే తీవ్రవాదుల కదలికలు కనిపెట్టేలా ఆధునిక పరికరాలతో భద్రతా విధుల్లో పాల్గొనాల్సిందిగా పారా మిలిటరీ బలగాలకు సూచనలిచ్చినట్లు డీజీపీ వివరించారు.

రంజాన్ వేళలు

బుధవారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.26

గురువారం : సహర్ : ఉదయం - 4.33



సమాచార దృష్టి

జూన్ 16కు యూపీఎస్సీ ప్రిలిమ్స్ వాయిదా

పెరంబూర్, మార్చి 19: యూపీఎస్సీ ప్రిలిమ్స్ వాయిదా పడ్డాయి. ఐఏఎస్, ఐపీఎస్ తదితర పోస్టుల భర్తీకి యూపీఎస్సీ రాతపరీక్ష నిర్వహిస్తుంది. 2024 ఏడాదికి ప్రిలిమ్స్ మే 26వ తేది జరుగుతాయని ఇదివరకే ప్రకటించారు. ఈ నేపథ్యంలో, లోక్‌సభ ఎన్నికల కారణంగా మే 26వ తేది జరగాల్సిన పరీక్షలు జూన్ 16కు వాయిదా వేసినట్లు యూపీఎస్సీ తెలిపింది.

పర్యావరణ శాఖలో ఉద్యోగ అవకాశం

ఐసిఎఫ్, మార్చి 19: రాష్ట్ర పర్యావరణ శాఖలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఔత్సాహికులు ఈనెల 21వ తేది సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. మేటా మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ పోస్టులకు నెలకు రూ.25,000 వేతనం అందజేస్తారు. ఏదైనా డిగ్రీ, తమిళం, ఆంగ్లంలో టైప్ రైటింగ్, కంప్యూటర్ పరిజ్ఞానం తెలిసినవారై ఉండాలి. వివరాలకు www.environment.tn.gov.in లో చూడవచ్చు.

రేపటి నుంచి లక్షార్చన

ఐసిఎఫ్, మార్చి 19: స్థానిక వడపళని సుబ్రమణ్యస్వామి ఆలయంలో గురువారం నుంచి శనివారం వరకు లక్షార్చన జరగనుంది. ఈ ఏడాది పంగుణి ఉత్తర ఉత్సవాలును పురస్కరించుకొని ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు లక్షార్చన నిర్వహించనున్నారు. అర్చనకు రూ.150 రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

తేనాంపేటలో వాననీటి కాలువలు

ఐసిఎఫ్, మార్చి 19: స్థానిక తేనాంపేట మండలంలో వాననీటి కాలువల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి.వర్షాకాలంలోగా పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ట్రిప్లికేన్, ఐస్‌హౌస్, అన్నాసాలై, మైలాపూర్, పోయస్ గార్డెన్, సెమ్మొళి పార్కు రోడ్డు ప్రాంతాల్లో వాననీటి కాలువల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

26న రామేశ్వరం జాలర్ల ఆందోళన

ఐసిఎఫ్, మార్చి 19: కేంద్రప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ రామేశ్వరం జాలర్లు ఈ నెల 26వ తేది సముద్రంలో ఆందోళన చేపట్టనున్నారు. రామేశ్వరం, పుదుకోట, కారైక్కాల్ ప్రాంతాలకు చెందిన జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి జైలుకు తరలించిన విషయం తెలిసిందే. జైలులో ఉన్న జాలర్లు, పడవలను విడిపించేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ జాలర్లు ఈ నెల 26వ తేది సముద్రంలో ఆందోళన చేపట్టనున్నారు.

8 విమాన సర్వీసుల రద్దు

అడయార్, మార్చి 19: చెన్నై నుంచి వివిధ ప్రాంతాలకు బయలుదేరి వెళ్లాల్సిన నాలుగు విమానాలు, వివిధ ప్రాంతాల నుంచి చెన్నైకు రావాల్సిన మరో నాలుగు విమానాలు రద్దు చేశారు. దీంతో ఆయా విమానాల్లో రాకపోకలు సాగించాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం చెన్నై నుంచి సేలం, జైపూర్, అయోధ్య, అహ్మదాబాద్‌లకు ప్రైవేటు విమాన సంస్థలు సర్వీసులను నడుపుతున్నాయి. ఈ విమానాలను నిర్వహణ కార్యకలాపాల కారణంగా రద్దు చేశారు. అలాగే, వివిధ ప్రాంతాల నుంచి చెన్నైకు రావాల్సిన మరో నాలుగు విమానాలను రద్దు చేశారు.

గుమ్మిడిపూండి సబర్బన్ రైళ్ల పాక్షిక రద్దు

పెరంబూర్, మార్చి 19: పొన్నేరి - మీంజూరు మార్గంలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా మూర్ మార్కెట్ కాంప్లెక్స్, చెన్నై బీచ్ నుంచి గుమ్మిడిపూండి వెళ్లే సబర్బన్ రైళ్లు పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

- మూర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి ఉదయం 9, 10.35 గంటలకు గుమ్మిడిపూండి బయల్దేరే సబర్బన్ రైళ్లు ఈ నెల 20, 21, 23, 24 తేదీల్లో గుమ్మిడిపూండికి బదులుగా మీంజూరు వరకు మాత్రమే నడుస్తుంది.
- గుమ్మిడిపూండి నుంచి ఉదయం 9.55 గంటలకు మూర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు బయల్దేరే సబర్బన్ రైలు ఈనెల 20, 21, 23, 24 తేదీల్లో గుమ్మిడిపూండికి బదులుగా మీంజూరు నుంచి బయల్దేరుతుంది.
- చెన్నై బీచ్ నుంచి ఉదయం 9.40 గంటలకు గుమ్మిడిపూండి బయల్దేరే సబర్బన్ రైలు ఈ నెల 21, 23, 24 తేదీల్లో గుమ్మిడిపూండికి బదులుగా ఎన్నూర్ వరకు మాత్రమే నడుస్తుంది.
- గుమ్మిడిపూండి నుంచి ఉదయం 10.55 గంటలకు చెన్నై బీచ్‌కు బయల్దేరే రైలు ఈనెల 21, 23, 24 తేదీల్లో గుమ్మిడిపూండికి బదులుగా ఎన్నూర్ నుంచి బయల్దేరుతుంది.
- సూళ్లూరుపేట నుంచి ఉదయం 10 గంటలకు మూర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు బయల్దేరే సబర్బన్ రైలు ఈ నెల 21, 23, 24 తేదీల్లో మూర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు బదులుగా గుమ్మిడిపూండి వరకు మాత్రమే నడుస్తుంది.

తిరుమలేశుడి సేవలో గవర్నర్ రవి



తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ రద్దు చేసిన అధికారులు, ప్రజలు సమస్యలు తెలిపేలా కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన పెట్టెలో వినతిపత్రం వేస్తున్న మహిళ

ద్రౌపది అమ్మవారి ఆలయంలో పూజలకు మాత్రమే అనుమతి

- మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు



ఆలయం ముందు మోహరించిన పోలీసులు, ఆలయానికి వేసిన సీలు (ఫైల్ ఫొటో)

ప్యారీస్, మార్చి 19: విల్లుపురం జిల్లా మేల్‌పాదిలో పూజలు నిర్వహణలో ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ కారణంగా సంవత్సరం క్రితం సీలు వేసిన ద్రౌపది అమ్మవారి ఆలయంలో భక్తులు లేకుండా పూజలు నిర్వహించేందుకు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆలయంలో దళిత వర్గాల వారు పూజలు నిర్వహించేందుకు మరో వర్గం వారు అభ్యంతరం తెలిపిన కారణంగా శాంతిభద్రతల సమస్య కారణం చూపి గత ఏడాది ఆలయానికి కోర్టు ఉత్తర్వులతో అధికారులు సీలు వేశారు. ఈ కేసులు హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్ సమక్షంలో మంగళవారం విచారణకు రాగా, గ్రామ ప్రజల మత నమ్మకాలకు గౌరవమిచ్చే విధంగా ఆలయంలో ప్రతిరోజు పూజలు నిర్వహించేందుకు అనుమతించాలని పిటిషనర్ తరపు న్యాయవాదులు కోరారు. మరోవైపు ఆన్‌లైన్ ద్వారా విచారణకు హాజరైన విల్లుపురం జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎన్నికల అధికారులు వివాదాస్పదమైన ఆలయాన్ని తెరిస్తే మళ్లీ శాంతిభద్రతలకు భంగం వాటిల్లే అవకాశముందని పేర్కొన్నారు. అడ్వొకేట్ జనరల్ కూడా శాంతిభద్రతలకు ఇబ్బంది లేకుండా న్యాయస్థానం జారీ చేసే ఉత్తర్వులు పాటిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా ప్రభుత్వ ప్లీడర్ కూడా ఆలయాన్ని తెరిస్తే భద్రతకు పోలీసులకు మోహరింపజేస్తామని తెలిపారు. ఇలా అన్ని వర్గాల వాదనల అనంతరం, ఆలయంలో పూజలు నిర్వహించేందుకు ఓ పూజారిని నియమించాలని హిందూ దేవాదాయ శాఖ విల్లుపురం జాయింట్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. పూజలు ముగిసిన అనంతరం ఆలయాన్ని మూసి వేయాలని, భక్తులను ఆలయంలోకి అనుమతించరాదని ఉత్తర్వులు జారీ చేస్తూ, తదుపరి విచారణ జూన్ 10కి వాయిదా వేశారు.

టీటీడీ ఆలయానికి రూ.50 లక్షల విరాళం



టీటీడీ ఈవో ధర్మారెడ్డికి చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే నందకుమార్ (చిత్రంలో) టీటీడీ చెన్నై సలహా మండలి అధ్యక్షుడు ఏజే శేఖర్

వేలూరు, మార్చి 19: డీఎంకే జిల్లా సెక్రటరీ, ఆనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్ స్థానిక టీటీడీ ఆలయానికి తొలివిడతగా రూ.50 లక్షల విరాళం అందజేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ సిఫారసులతో టీటీడీ దేవస్థానం ట్రస్టీ కమిటీ సభ్యుడిగా 2021 సెప్టెంబరు నుంచి 2023 ఆగస్టు వరకు వ్యవహరించిన నందకుమార్, పలు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం టీటీడీ తమిళనాడు, పుదుచ్చేరి స్థానిక సలహా మండలి అధ్యక్షుడిగా మూడోసారి ఎంపికైన ఏజే శేఖర్, వేలూరులోని టీటీడీ సమాచార కేంద్రంలో రూ.5 కోట్లతో కొత్త గుడి నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని టీటీడీ పిలుపునిచ్చింది. స్పందించిన ఎమ్మెల్యే నందకుమార్, ఆలయ నిర్మాణానికి రూ.1.25 కోట్లు అందిస్తామని ప్రకటించి, తొలివిడతగా రూ.50 లక్షల చెక్‌కు టీటీడీ ఈవో ధర్మారెడ్డికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ చెన్నై సలహా మండలి అధ్యక్షులు ఏజే శేఖర్ తదితరులు కూడా పాల్గొన్నారు.

రాత్రుల్లో విధుల్లో ఉండాలి : ఈబీ

ఐసిఎఫ్, మార్చి 19: ఇంజనీర్లు రాత్రుల్లో తప్పనిసరిగా విధుల్లో ఉండాలని విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో ఎండ తీవ్రత కారణంగా దినసరి విద్యుత్ వినియోగం 18,500 మెగావాట్లకు పెరిగింది. ఓవర్‌లోడ్ కారణంగా విద్యుత్ సాధనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రస్తుతం పాఠశాల, కళాశాలల విద్యార్థులకు పరీక్షలు, ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ కోతలు తలెత్తకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని, రాత్రి సమయాల్లో తప్పనిసరిగా విధుల్లో ఇంజనీర్లు ఉండాలని విద్యుత్ బోర్డు ఆదేశాలు జారీ చేసింది.

రూ.68 కోట్లతో ప్రభుత్వ టీ ఫ్యాక్టరీల పునరుద్ధరణ

ఐసిఎఫ్, మార్చి 19: తేయాకుకు గిట్టుబాటు ధర లభించేలా నాబార్డు సహాయంతో రూ.68 కోట్లతో 15 టీ ఫ్యాక్టరీల ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. నీలగిరి జిల్లాలో ప్రైవేటు టీ కర్మాగారాలు ఎక్కువగా ఉన్నాయి. చిన్న తేయాకు రైతులు లబ్ధిపొందేలా రాష్ట్రప్రభుత్వం 'ఇండ్‌కో సర్వ్' అనే చిన్న తేయాకు ఉత్పత్తిదారుల సహకార టీ ఫ్యాక్టరీల సమాఖ్యను ప్రారంభించింది. ఈ సమాఖ్యలో 16 టీ ఫ్యాక్టరీలుండగా, 27 వేలమంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వారు తాము పండించే తేయాకును 'ఇండ్‌కో సర్వే' సంస్థ అందిస్తున్న గిట్టుబాటు ధరకు విక్రయిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీల్లో తయారు చేస్తున్న టీ పొడి మార్కెట్లో, రేషన్ దుకాణాల్లోను 'ఊటీ' పేరుతో విక్రయిస్తున్నారు. ఆ నేపథ్యంలో, ఈ ఫ్యాక్టరీలను రూ.68 కోట్లతో పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వివక్ష, హింసకు వ్యతిరేకంగా సిమట్స్ ఒప్పందం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అడయార్, మార్చి 19: వివక్ష, హింసకు వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకు నగరంలోని ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన సవీత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ (సిమట్స్).. యూత్ యునైటెడ్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మహిళలు, బాలికల పట్ల వివక్ష, హింసకు వ్యతిరేకంగా రెడ్ కార్డ్ పేరుతో ఈ క్రియాశీల, సామాజిక కార్యక్రమాన్ని చేపట్టనుంది. పౌరులకు సాధికారత కల్పించడం, లింగ ఆధారిత వివక్ష, హింస వంటి ముఖ్యమైన సమస్యలపై అవగాహన కల్పించనుంది. ఇదే విషయంపై తండలం సిమట్స్ క్యాంపస్ నుంచి ర్యాలీని నిర్వహించినట్లు ఆ విద్యా సంస్థ విడుదల పేర్కొంది.

డాక్టర్ ఆనంద్ కుమార్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ ప్రదానంచేస్తున్న నిర్వాహకులు

అడయార్, మార్చి 19: దేశంలో ప్రముఖ ఇమ్యునాలజికల్స్ లిమిటెడ్ డాక్టర్ కె.ఆనంద్‌కుమార్‌కు ప్రతిష్ఠాత్మక గౌరవ డాక్టరేట్‌ను సవీత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ ప్రదానం చేసింది. ఆ సంస్థ 22వ స్నాతకోత్సవంలో ఆనంద్‌కుమార్‌కు 'డాక్టర్ ఆఫ్ సైన్సెస్' అవార్డును ప్రదానం చేశారు. లైఫ్ సైన్సెస్ విభాగంలో ఆయన చేసిన విశేషసేవలకు గుర్తింపుగా దీన్ని అందజేశారు. ముఖ్యంగా డాక్టర్ ఆనంద్‌కుమార్ దూరదృష్టి గల నాయకత్వం అనేక ముఖ్యమైన మానవ, జంతు వ్యాక్సిన్ అభివృద్ధికి దారితీసింది. ఈ క్లిష్టమైన రంగంలో దేశం స్వయం సమృద్ధిని గణనీయంగా సాధించేందుకు దోహదపడింది. వైద్య పరిశోధన, అవిష్కరణలను అభివృద్ధి చేయడంలో ఆయన అంకితభావం, దేశ, విదేశీ జీవశాస్త్రం సమాజంలో విస్తృతమైన ప్రశంసలు వచ్చాయి.

రెండు ప్రైవేటు పాఠశాలలకు బాంబు బెదిరింపులు

పెరంబూర్, మార్చి 19: నీలగిరి జిల్లా ఊటీలోని రెండు ప్రైవేటు పాఠశాలలకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. ఇటీవల చెన్నై, కోవైలోని ప్రైవేటు పాఠశాలలకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ బెదిరింపులు విదేశాల నుంచి వచ్చినట్లు భావిస్తున్న రాష్ట్ర పోలీసులు ఇంటర్‌పోల్ సాయం తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, ఊటీలోని జేఎస్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్, గుడ్‌షెపర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ తదితరాలకు మంగళవారం మధ్యాహ్నం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో, స్కూలు నిర్వాహకులు జిల్లా ఎస్పీ కార్యాలయానికి సమాచారం అందించారు. పోలీసు జాగిలాలు, బాంబ్ స్క్వాడ్ నిపుణుల బృందాలు పాఠశాలలకు చేరుకొని తరగతి గదులు, ప్రాంగణాలు మొత్తం సుమారు గంట సేపు గాలించి అది ఫేక్ మెసేజ్‌గా గుర్తించారు.

పళని గిరి ప్రదక్షిణ మార్గం చుట్టూ బ్యారికేడ్లు

పెరంబూర్, మార్చి 19: పళని గిరి ప్రదక్షిణ మార్గం చుట్టుపక్కల బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. పళని గిరి ప్రదక్షిణ మార్గంలోకి ఆక్రమణలు తొలగించాలంటూ దాఖలైన పిటిషన్ మళ్లీ మంగళవారం న్యాయస్థానం విచారించింది. ఆ సమయంలో గిరి ప్రదక్షిణ మార్గంలో అదనపు విద్యుద్దీపాలు, సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఆలయ నిర్వాహకులు అఫిడవిట్ దాఖలు చేశారు. అలాగే, న్యాయస్థానం ఆదేశాల మేరకు ఐదు నెలల్లో గిరి ప్రదక్షిణ రోడ్డులోని పంచామృత దుకాణాలకు తొలగించనున్నారు.

బైక్ సాహసాలకు పాల్పడే వారిని క్రిమినల్స్‌గా చూడొద్దు

పెరంబూర్, మార్చి 19: బైక్ సాహసాలకు పాల్పడే వారిని క్రిమినల్స్‌గా ముద్ర వేయకుడా వారిని సంస్కరించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర పోలీసు శాఖకు మద్రాసు హైకోర్టు సూచించింది. అలాగే, బైక్ ప్రమాదాల పర్యవసానాలపై అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి కేసులు ఎదుర్కొనేందుకు అవసరమైన విధానాలు రూపొందించాలని హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ ప్రభుత్వానికి సూచించారు.

అభ్యర్థితో పాటు ఐదుగురు మాత్రమే

- చెన్నై జిల్లా ఎన్నికల అధికారి రాధాకృష్ణన్

పెరంబూర్, మార్చి 19: నామినేషన్ దాఖలుచేసే సమయంలో అభ్యర్థితో పాటు ఐదుగురిని మాత్రమే ఎన్నికల అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తామని చెన్నై జిల్లా ఎన్నికల అధికారి జె.రాధాకృష్ణన్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ఈనెల 20న బుధవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో, రాధాకృష్ణన్ మీడియాతో మాట్లాడుతూ... చెన్నై జిల్లా పరిధిలోని మూడు లోక్‌సభ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ఈనెల 27వ తేది వరకు జరుగుతుందన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోపు దాఖలు చేయవచ్చన్నారు. ఎన్నికల అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో అభ్యర్థులకు చెందిన రెండు వాహనాలు మాత్రమే అనుమతిస్తామని తెలిపారు.

డ్రగ్ స్మగ్లింగ్ ధనంతో హోటల్, సినీ రంగాలలో పెట్టుబడి

- విచారణలో జాఫర్ సాదిక్ వెల్లడి



శాంథోమ్‌లోని జాఫర్ సాదిక్ నివాసగృహం

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు మాదక ద్రవ్యాలను స్మగ్లింగ్ చేసి సంపాదించిన కోట్లాది రూపాయలను తమిళ సినీ నిర్మాత, డీఎంకే విదేశీవ్యవహారాల విభాగం మాజీ ఇన్‌చార్జి జాఫర్ సాదిక్ సినీ, హోటల్ రంగాల్లో పెట్టుబడిగా పెట్టాడని తాజా విచారణలో వెల్లడైంది. ఢిల్లీ నుంచి సుమారు రూ.2వేల కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను రవాణా చేసిన కేసులో జాఫర్‌ను ఈ నెల9న అరెస్టు చేసిన విషయం విదితమే. 10 రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని ఆయన వద్ద విచారణ జరిపారు. ఈక్రమంలో ఆయన్ను ఢిల్లీ నుంచి చెన్నైకి విమానంలో తీసుకువచ్చారు. శాంథోమ్‌లో ఉన్న జాఫర్ సాదిక్ ఇంటికి తీసుకెళ్లి విచారణ చేపట్టారు. అదే విధంగా పెరుంగుడి లోని గోదాము వద్ద కూడా విచారణ జరిపారు. స్మగ్లింగ్ ద్వారా సంపాదించిన ధనంతో మూడు తమిళ సినిమాలను నిర్మించినట్లు తెలుసుకున్నారు. అదే విధంగా హోటల్ రంగంలోనూ పెట్టుబడులు పెట్టినట్లు కనుగొన్నారు. ఢిల్లీలో తాను ఆహార వస్తువులను విదేశాలకు ఎగుమతి చేసి కోట్లు గడించినట్లు చెప్పుకునేవాడని వెల్లడైంది. ఇదిలా ఉండగా ఈ కేసులో జాఫర్ సాదిక్ సోదరులు ఇరువురి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

32 ప్రభుత్వ పాఠశాలల మూసివేత

ఐసిఎఫ్, మార్చి 19: విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు మూసివేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. తొలివిడతగా కళ్లకుర్చి జిల్లాలో 32 పాఠశాలలు మూతపడనున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా ఈనెల 1వ తేది నుంచి విద్యార్థుల అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. అదే సమయంలో నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద నిర్ణయించిన దాని కన్నా తక్కువ విద్యార్థులు కలిగిన పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం కళ్లకుచ్చి జిల్లాలో 31 ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు మూతపడనున్నాయి.

పూంజేరి నుంచి ఎన్నూర్ వరకు భూసేకరణ

ఐసిఎఫ్, మార్చి 19: నగర సరిహద్దు పథకంలో పూంజేరి నుంచి ఎన్నూరు వరకు 200 అడుగుల రోడ్డు నిర్మాణానికి భూసర్వే ప్రారంభమైంది. నగరంలో తలెత్తే ట్రాఫిక్ సమస్య పరిష్కరించేలా కార్పొరేషన్ పరిధిలో భారీ వాహనాల ప్రవేశించడాన్ని అడ్డుకొనేందుకు ఎన్నూర్ హార్బర్ నుంచి మహాబలిపురం సమీపంలోని పూంజేరి జంక్షన్ వరకు 200 అడుగుల రోడ్డు రూ.6,175 కోట్లతో నిర్మించనున్నారు. ఈ పనుల కోసం 4,797 చెట్లు తొలగించనున్నారు. 133 కి.మీ పొడవైన ఈ మార్గంలో ఐదు పెద్ద వంతెనలు, 20 చిన్న వంతెనలు, 324 నేల వంతెనలు, 49 సొరంగ మార్గాలు, 4 ఫ్లై ఓవర్లు, 3 రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు.

205 మందికి గవద బిళ్లలు

ఐసిఎఫ్, మార్చి 19: రాష్ట్రంలో ఈనెల 205 మంది గవద బిళ్లల వైరస్ (మంప్స్ వైరస్)కు గురయ్యారు. ఈ వైరస్ ద్వారా వ్యాపించే గవదబిళ్లలు వ్యాధి చెవులు, గడ్డం కింద భాగాల్లో వాపు కలిగిస్తుంది. ఈ వైరస్ బాధితులు తుమ్ములు, దగ్గు, జలుబు, లాలాజలం ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. వారం నుంచి 14 రోజుల పాటు శరీరంలో వైరస్ ప్రవేశించి వ్యాధి లక్షణాలను బహిర్గతం చేస్తుంది. ఈ వ్యాధికి మందులు అవసరం లేకపోయినప్పటికీ, బాధితులను ప్రత్యేకంగా ఉంచితే సరిపోతుందని వైద్యులు తెలిపారు.

ఘనంగా పూంగా వనత్తమ్మన్ రథోత్సవం

ఐసిఎఫ్, మార్చి 19: తిరువణ్ణామలై జిల్లా పోలూరు, చిత్తేరి గ్రామంలో ఉన్న ప్రాచీన పూంగా వనత్తమ్మన్ రథోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈనెల 9వ తేది ప్రారంభమైన ఆలయ ఉత్సవాలు 22వ తేది వరకు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 5వ రోజైన మంగళవారం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో రథంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రథోత్సవంలో చుట్టుపక్కల గ్రామాలు, ఇతర జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు పాల్గొనగా, భక్తులకు ప్రసాద వినియోగం జరిగింది.

బైకును ఢీకొన్న లారీ : విద్యార్థిని మృతి

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చోళవరం సమీపం ఆత్తూరు వద్ద బైకును లారీ ఢీకొని ప్లస్-2 విద్యార్థిని మృతి చెందింది. బైకును నడిపిన ఆమె తండ్రి తీవ్రంగా గాయపడ్డారు. రెడ్‌హిల్స్ సమీపం పుళల్ గంగాధరన్ మూడో వీధిలో నివసిస్తున్న దయానిధి మాధవరంలో 31వ వార్డులో కార్పొరేషన్ ఆరోగ్య విభాగంలో కాంట్రాక్టు కార్మికుడు. ఆయన కుమార్తె జయభారతి(15) ప్లస్-2 చదువుతోంది. వీరిరువురూ మంగళవారం ఉదయం బైకులో అమితనల్లూరులోని బంధువుల ఇంటికి వెళ్లి తచ్చూరు కూడలి రోడ్డు మీదుగా తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో ఆత్తూరు వద్ద ఆ బైకును వెనుకవైపు లారీ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో జయభారతి రోడ్డుపై పడి తీవ్రగాయాలతో ఆ స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. తీవ్రంగా గాయపడిన దయానిధిని ఆసుపత్రికి తరలించారు.

రూ.3.80 లక్షల నగదు స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

వేలూరు, మార్చి 19: స్థానిక కాట్పాడి సమీపంలోని క్రిస్టియన్‌పేట చెక్‌పోస్టులో వాహనంలో తరలిస్తున్న రూ.3.8 లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభపెట్టేలా నగదు, బహుమతుల పంపిణ అడ్డుకొనేలా ఈసీ పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో, చెక్‌పోస్టులో తనిఖీలు చేపట్టిన అధికారులు, ఆంధ్ర రాష్ట్రం కమ్మవారిపల్లె నుంచి వేలూరు బాగాయం వైపుకు వెళ్తున్న కారులో తనిఖీలు చేపట్టి రూ.3,84,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పెరియార్ పార్కు అన్నా ఆడిటోరియంలో మంగళవారం ఉదయం ఎక్సైజ్ అధికారులు జరిపిన తనిఖీల్లో 336 బ్రాందీ సీసాలు, 94 బీర్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వసంతాపురానికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

అదనంగా 176 పోలింగ్ కేంద్రాలు

- నేటినుంచి నియోజకవర్గాల వారీగా ఈవీఎంల విభజన
- ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు



ప్యారీస్, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్‌లతో సమావేశమైన అనంతరం అదనంగా 176 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు పేర్కొన్నారు. సచివాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... ఒక్కో జిల్లాలో ఆహార పదార్థాల ధరలు సమానంగా లేని కారణంగా ఎన్నికల ఖర్చు నిమిత్తం నిర్ణయించిన ధర పట్టికను మళ్లీ పరిశీలించాల్సిందిగా సోమవారం జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈనెల 20 నుంచి 25వ తేది వరకు 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించేలా ఫారాలు అందిస్తామని తెలిపారు. ఎండీఎంకే, నామ్ తమిళర్ పార్టీలకు ఎన్నికల గుర్తు కేటాయించడంపై కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. బుధవారం నుంచి పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఈవీఎం , వీవీపాట్ ఇతర ఎన్నికల సామగ్రి విభజన పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగుల కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు సుమారు 4 లక్షల మంది పాల్గొంటారని సత్యప్రదసాహు తెలిపారు.

ప్రధాన పార్టీలు లేకపోయినా అధిక స్థానాలు మావే : ఈపీఎస్



ప్యారీస్, మార్చి 19: తమ కూటమిలో ప్రధాన రాజకీయ పార్టీలు లేకపోయినప్పటికీ, అధిక స్థానాల్లో విజయం సాధిస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ధీమా వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... 2019 లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో తమ కూటమిలో ఉన్న పీఎంకే, డీఎండీకే తదితర పార్టీలు ఈ సారి బయటకు వెళ్లిన కారణంగా తాము బలహీన పడినట్లు ప్రత్యర్థులు చేసే విమర్శల్లో వాస్తవం లేదన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత నేతృత్వంలో అన్నాడీఎంకే పొత్తుల కోసం ఎదురుచూడకుండా ఒంటరిగా పోటీచేసి 45 శాతం ఓట్లు రాబట్టుకొని 38 స్థానాలు కైవసం చేసుకుందని, ఆస్థాయిలోనే ఈ సారి ఎన్నికల్లో కూడా అధిక స్థానాల్లో రెండాకుల గుర్తును గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఈపీఎస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

పుదుచ్చేరిలో కాదు... తమిళనాడు నుంచే పోటీ

- తమిళిసై సౌందర్‌రాజన్



ప్యారీస్, మార్చి 19: కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి నుంచి కాకుండా తమిళనాడులో తాను లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు తమిళిసై సౌందర్‌రాజన్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుకూలంగా తమిళిసై తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల గవర్నర్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సాధ్యమైనంత వరకు ఆమె పుదుచ్చేరిలో ఉన్న ఒక్క పార్లమెంటు నియోజకవర్గంలో కమలం గుర్తుపై బీజేపీ తరఫున పోటీ చేస్తారని అందరూ ఊహించారు. అయితే ఆ రాష్ట్రంలో ఆమెకు తీవ్ర వ్యతిరేకత తెలుపుతున్నట్లు తెలిసింది. ఫ్రెంచ్ పాలన కింద ఉన్న పుదుచ్చేరిని భారతదేశానికి అప్పగించే సమయంలో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఇక్కడ పోటీ చేయరాదని ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని, దీన్ని ఉల్లంఘించడం చట్టరీత్యా నేరమని, కాంగ్రెస్, అన్నాడీఎంకే, డీఎంకేలు అభ్యంతరం తెలిపాయి. దీంతో, పుదుచ్చేరిలో తాను పోటీ చేయడం లేదని, పార్టీ అధిష్ఠానం రాష్ట్రంలో ఎక్కడ పోటీ చేయమని ఆదేశించినా తాను సిద్ధంగా ఉన్నట్లు తమిళిసై తెలిపారు.

దేశంలో కమలానికి వ్యతిరేక పవనాలు

- సీపీఎం నేత రామకృష్ణన్

అడయార్, మార్చి 19: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఓటమి తప్పదని సీపీఎం జాతీయ నేత జి.రామకృష్ణన్ అన్నారు. ఆయన మంగళవారం తిరునెల్వేలిలో విలేకరులతో మాట్లాడుతూ... రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధించడం ఖాయమన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ... తాము ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదన్నారు. అంతేకాకుండా పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తు ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై ఐటీ, ఈడీ ఉసిగొల్పుతున్నారని మండిపడ్డారు.

బిర్యానీ పంపిణీ : మాజీ మంత్రిపై కేసు


పెరంబూర్, మార్చి 19: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి బిర్యానీ పంపిణీ చేశారంటూ అన్నాడీఎంకే మాజీ మంత్రి బెంజిమెన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. నెర్కుంద్రం మీనాక్షిఅమ్మన్ నగర్‌లో సోమవారం బెంజిమెన్ అన్నాడీఎంకే జెండా ఆవిష్కరించి, 200 మందికి బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా బిర్యానీ పంపిణీ చేశారంటూ గ్రామ నిర్వహణ అధికారి కుమార్ కోయంబేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు మాజీ మంత్రి సహా కార్యక్రమ నిర్వాహకుడు కమల్‌కన్నన్ తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మోదీ ప్రచారంలో పాఠశాల విద్యార్థులు

- హెచ్‌ఎం వద్ద ముగిసిన విచారణ

పెరంబూర్, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నరేంద్ర మోదీ సోమవారం సాయంత్రం కోవైలో రోడ్ షోలో యూనిఫాం ధరించిన విద్యార్థులు పాల్గొన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడ్డాయి. ఎన్నికల ప్రచారంలో పాఠశాల విద్యార్థులను వినియోగించారంటూ ఫిర్యాదులందాయి. ఈ వ్యవహారంపై కలెక్టర్ ఉత్తర్వులతో సాయిబాబా విద్యాలయ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో జిల్లా ప్రాథమిక విద్యాధికారి పునిత మంగళవారం విచారించారు. పాఠశాల హెచ్‌ఎం వద్ద సుమారు 3 గంటలు విచారణ జరిపారు. విచారణ నివేదికను కలెక్టర్, జిల్లా ప్రధాన విద్యాధికారికి అందజేశారు.

ఎంటీఆర్ నుంచి ఏఆర్ఎస్ సీఆర్ఎస్ 5500 ఇనుప చువ్వలు



అడయార్, మార్చి 19: ప్రముఖ టీఎంటీ ఐరన్ రాడ్ల తయారీ కంపెనీ ఏఆర్ఎస్ సీఆర్ఎస్ 550డి పేరుతో కొత్తగా ఇనుప చువ్వలను మార్కెట్‌లోకి విడుదల చేసింది. అన్ని నిర్మాణాలకు వినియోగించవచ్చని, తుప్పు పట్టకుండా, భూకంపాలను సైతం తట్టుకునేలా తయారు చేసినట్టు ఏఆర్ఎస్ గ్రూపు వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ అశ్విని కుమార్ భాటియా చెప్పారు. నిర్మాణ సామాగ్రిపై అవగాహన లేకపోవడం, నాణ్యమైన మెటీరియల్ అందుబాటులో లేకపోవడం వల్ల తక్కువ ధరకు వచ్చే స్టీల్‌ను కొనుగోలు చేస్తున్నారన్నారు. తమ కంపెనీ ఉత్పత్తి చేసే వస్తువులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూనే వారికి నాణ్యమైనవి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అలాగే, కస్టమర్ డిమాండ్‌పై అవగాహన ఉందన్నారు. అందుకు అనుగుణంగానే తమ ఉత్పత్తులు ఉంటాయన్నారు. తమ ఉత్పత్తులు ఇప్పటికే మార్కెట్‌లో ఉన్నప్పటికీ, అధిక ధరల కారణంగా భారీ నిర్మాణాలకు మాత్రమే ఉపయోగిస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఏఆర్ఎస్ సీఆర్ఎస్ 550డి అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు.



ఓటు హక్కు వినియోగంపై విద్యార్థినుల వినూత్న అవగాహన ప్రచారం



ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో చెన్నై గోడలపై ప్రచార ప్రకటనలకు రంగులేస్తున్న ప్రభుత్వ కార్మికులు



ఎప్పటికి గుర్తించారు సారూ?!

బీజేపీ కూటమితో రాష్ట్రంలో రాజకీయ పెనుమార్పులు తథ్యం

● పీఎంకే ప్రధాన కార్యదర్శి అన్బుమణి రాందాస్

సామాన్య ఓటరు

● అర్ధరాత్రి అన్నాడీఎంకే వర్గాల్లో ఈ మార్పు కనిపించలేదా సారూ!



● అప్పుడు ఇప్పుడు



గత 2019 లోక్‌సభ ఎన్నికలు, ప్రస్తుతం జరగనున్న 2024 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఒకేలా ఉంది. గతంలో వున్న ఒకటీ, అరా చిన్నా చితకా పార్టీలు మినహా మిగిలినవన్నీ అలానే ఉన్నాయి. ఆయా పార్టీలకు గతంలో ఇచ్చినన్ని స్థానాలనే ఈ సారి కూడా డీఎంకే కేటాయించింది. అయితే కొన్ని నియోజకవర్గాలు మాత్రం మారాయి. అవేంటో ఒక్కసారి పరిశీలిద్దాం... - పెరంబూర్

డీఎంకే కూటమిలో నాడు...నేడు

డీఎంకే...

గత 2019 లోక్‌సభ ఎన్నికల్లో 20 స్థానాల్లో పోటీ చేసిన డీఎంకే, ప్రస్తుత ఎన్నికల్లో 21 స్థానాల్లో రంగంలోకి దిగింది. వాటిల్లో ఈరోడ్, పెరంబలూరు, తేని, కోయంబత్తూర్, ఆరణి స్థానాలు కూటమినుంచి చేజిక్కించుకుంది. బదులుగా డీఎంకే గతంలో పోటీ చేసిన దిండుగల్ స్థానాన్ని సీపీఎంకు, కడలూరు, మైలాడుదురై, తిరునెల్వేలి స్థానాలు కాంగ్రెస్‌కు అప్పగించింది.

కాంగ్రెస్...

కాంగ్రెస్ పార్టీ ఇదివరకు పోటీ చేసిన ఆరణి, తేని స్థానాలు డీఎంకేకు, తిరుచ్చి స్థానాన్ని ఎండీఎంకేకు అప్పగించింది. అందుకు బదులుగా గత ఎన్నికల్లో డీఎంకే పోటీ చేసిన కడలూరు, మైలాడుదురై, తిరునెల్వేలి స్థానాల్లో అదృష్టాన్ని పరిశీలించుకోనుంది.

సీపీఎం...

సీపీఎం 2019లో పోటీ చేసిన కోయంబత్తూర్ స్థానాన్ని డీఎంకేకు అప్పగించింది. అందుకు బదులుగా డీఎంకే పోటీ చేసిన దిండుగల్ స్థానాన్ని చేజిక్కించుకుంది.

ఎండీఎంకే...

ఎండీఎంకే గత ఎన్నికల్లో డీఎంకే గుర్తు ఉదయించే సూర్యుడిపై ఈరోడ్‌లో పోటీ చేసింది. ఆ స్థానాన్ని ప్రస్తుతం డీఎంకేకు అప్పగించగా, కాంగ్రెస్ నుంచి తిరుచ్చి స్థానాన్ని చేజిక్కించుకుంది. ఆ స్థానంలో ప్రత్యేక చిహ్నంతో పోటీ చేయనున్నట్లు ఎండీఎంకే ప్రకటించింది.

అవే స్థానాలు...

డీపీఐ, సీపీఐ, ఇండియా యూనియన్ ముస్లిం లీగ్, కొంగునాడు మక్కల్ కట్చి తదితర పార్టీలు గతంలో పోటీ చేసిన స్థానాల్లోనే ప్రస్తుత ఎన్నికల్లోనూ పోటీ చేయనున్నాయి.

ఎంఎన్ఎంకు రాజ్యసభ...

డీఎంకే కూటమిలో తాజాగా చేరిన నటుడు కమలహాసన్ నేతృత్వంలోని మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ఏ స్థానం కేటాయించలేదు. అందుకు బదులుగా, ఆ పార్టీకి 2025లో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో ఒక స్థానం కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.

ఆ సీన్ రిపీట్ అయ్యేనా....!

పెరంబూర్, మార్చి 19: ఆ సీన్ రిపీట్ కావాలని బీజేపీ శ్రేణులు గంపెడాశతో ఉన్నారు. 2001 శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన ముగ్గురు నాయకులు డాక్టర్ అన్బుమణి రాందాస్ (పీఎంకే), టీటీవీ దినకరన్ (అన్నాడీఎంకే), జీకే వాసన్ (టీఎంసీ) గెలుపొందారు. ఆ సమయంలో కాంగ్రెస్‌తో అన్నాడీఎంకే, టీఎంసీ, పీఎంకే కూటమిగా ఏర్పడి అధికారం కైవసం చేసుకున్నాయి. ప్రస్తుతం ఆ నాయకుల కాంబినేషన్ బీజేపీ వైపు మళ్లింది. వారు కూటమిలో చేరడంతో 2001లో చవిచూసిన మెజార్టీ విజయాలు మళ్లీ రిపీట్ అయితే బావుండునని కమలదళం కోరుకుంటోంది. ఎంతైనా ఆశ కదా!



అన్బుమణి - టీటీవీ దినకరన్ - జీకే వాసన్

● ఏం చెప్పావ్ బాసూ!

రెండాకులు కాకుంటే అరిటాకులు

● నటుడు మన్సూర్ అలీఖాన్ వ్యంగ్యోక్తులు

అడయార్, మార్చి 19: 'అయితే రెండాకులు... కాకుంటే ... అరిటాకులు' అంటూ వేలూరు ప్రచారంలో దూసుకుపోతున్నారు నటుడు మన్సూర్ అలీఖాన్. వేలూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి బరిలో దిగుతున్నట్లు ప్రకటించిన ఆయన... అన్నాడీఎంకే కూటమిలో చేరేందుకు నానా ప్రయత్నాలు చేశారు. అయితే అటు నుంచి స్పందన లేకపోవడంతో వేలూరులో ఒంటరిగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. వేలూరులో వాకింగ్ చేస్తూ, వీధివీధి తిరుగుతూ స్థానికులతో మాట్లాడుతున్నారు. అంతేగాక సోమ, మంగళవారాల్లో స్థానికంగా ఉండే క్రీడా మైదానంలో యువకులతో కలిసి క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'అరిటాకులు ఆరోగ్యానికి మంచిది... అలాగే, రెండాకులు కూడా ఆరోగ్యానికి మంచివే... కానీ, కరివేపాకులా మారకండి. పాలారు నదిపై ఆంధ్ర ప్రభుత్వం కట్టిన డ్యాంలు ఒకే బాంబుతో పేల్చివేస్తా'ను అంటూ ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే ఈ మాటల బాంబులు ఓట్లు రాలుస్తాయంటారా?..



ప్రచారంలో భాగంగా క్రికెట్ ఆడుతున్న మన్సూర్ అలిఖాన్



● తెలుసుకోండి

తపాలా ఓటు హక్కు వినియోగం ఎలా?

ఐసిఎఫ్, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల్లో 85 ఏళ్ల పైబడినవారు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసేలా ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఇందుకోసం 14డి ఫారాన్ని సదరు వ్యక్తుల ఇళ్లకు వెళ్లి పోలింగ్ బూత్ అధికారి అందజేస్తారు. ఈ ఫారాన్ని పొంది ఇంటి నుంచే ఓటు నమోదు చేయవచ్చు. వీడియోగ్రాఫర్, పోలీసుల బృందం బ్యాలెట్ బాక్స్‌తో వెళ్లి పోలింగ్‌ను వీడియో తీస్తారు. ఈ ప్రక్రియ సుమారు 20 నిమిషాల్లో ముగియనుంది. అలాంటి ఓట్లు తపాలా ఓట్లతో చేర్చి లెక్కించనున్నారు.

● నియోజకవర్గాల వైచిత్రం

ఒక జిల్లాకు ముగ్గురు ఎంపీలు



ఐసిఎఫ్, మార్చి 19: జిల్లాకో ఎంపీ అన్నది సామాన్య విషయమే. అయితే మదురై జిల్లా మాత్రం ముగ్గురు ఎంపీలను కలిగి ఉంది. దీంతో జిల్లాలో జరిగే అభివృద్ధి పనుల సమీక్షా సమావేశాల్లో ముగ్గురు ఎంపీలు పాల్గొనాల్సి వస్తోంది. ఈ జిల్లాకు సంబంధించి మేలూరు, మదురై ఈస్ట్, మదురై నార్త్, మదురై సెంట్రల్, మదురై సౌత్, మదురై వెస్ట్, తిరుప్పరంకుండ్రం, తిరుమంగళం, ఉసిలంపట్టి, చోళవందాన్ అనే 10 శాసనసభ నియోజకవర్గాలున్నాయి. వీటిలో మేలూరు, మదురై ఈస్ట్, మదురై సెంట్రల్, మదురై నార్త్, మదురై సౌత్, మదురై వెస్ట్ శాసనసభ నియోజకవర్గాలు మదురై లోక్‌సభ నియోజకవర్గంలో, తిరుమంగళం, తిరుప్పరంకుండ్రం నియోజకవర్గాలు సగభాగం విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గంలోకి వస్తున్నాయి. అలాగే, చోళవందాన్, ఉసిలంపట్టి శాసనసభ నియోజకవర్గాలు తేని లోక్‌సభ నియోజకవర్గంలో వస్తున్నాయి.

అంత ప్రతిష్ఠాత్మకమా?

● ఈరోడ్ డీఎంకే అభ్యర్థి గెలుపుకోసం ముగ్గురు మంత్రులు



మంత్రులు సామినాథన్, ముత్తుసామి, కయల్‌విళి

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ లోక్‌సభ నియోజకవర్గంలో 2014లో ఎదురైన చేదు అనుభవం నుంచి బయటపడేలా ఈ సారి అధికార పక్షమైన డీఎంకే తన అభ్యర్థి గెలుపు కోసం ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించింది. ఆ నియోజకవర్గంలో పోటీ చేయనున్న అభ్యర్థిని గెలిపించేందుకు ముగ్గురు మంత్రులను బరిలోకి దింపింది. 2009లో ఈరోడ్ లోక్‌సభ నియోజకవర్గం ఆవిర్భవించినప్పటి నుంచీ ఇప్పటి వరకూ ఆ నియోజకవర్గంలో మూడుసార్లు ఎన్నికలు జరిగాయి. 2009లో అన్నాడీఎంకే కూటమి తరఫున పోటీ చేసిన ఎండీఎంకే అభ్యర్థి గణేశమూర్తి... డీఎంకే కూటమి తరఫున పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి ఈవీకేఎస్ ఇళంగోవన్‌ను ఓడించారు. 2014లో ఈ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. ఆ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థి సెల్వకుమార్ చిన్నయన్ గెలిచారు. ఎన్డీయే తరఫున పోటీ చేసిన ఎండీఎంకే అభ్యర్థి గణేశ్‌మూర్తికి రెండో స్థానం, తొలిసారిగా పోటీ చేసిన డీఎంకే అభ్యర్థి పవిత్రవళ్ళికి మూడో స్థానం దక్కాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి తరఫు పోటీ చేసిన గణేశ్‌మూర్తి గెలిచారు. ఈ నేపథ్యంలో ఈరోడ్ నియోజకవర్గంలో డీఎంకే పోటీ చేయడానికి సిద్ధమవుతోంది. డీఎంకే యువజన విభాగం డిప్యూటీ కార్యదర్శి కేఈ ప్రకాష్, ఈరోడ్ సౌత్ యువజన విభాగం సమన్వయకర్త జే.తిరువాసగం, డీఎంకే చేనేత విభాగం కార్యదర్శి సచ్చిదానం దరఖాస్తులు సమర్పించారు. వీరిలో ఎవరిని నిలబెట్టినా ఆ అభ్యర్థిని గెలిపించే బాధ్యతలను ఈరోడ్ జిల్లాకు చెందిన ముత్తుసామి, సామినాథన్, కయల్‌విళికి డీఎంకే అధిష్టానం అప్పగించింది. ఈ విషయమై ఈరోడ్‌కు చెందిన డీఎంకే సీనియర్ నేత మాట్లాడుతూ... పార్టీ శ్రేణుల చిరకాల కోరిక మేరకు తమ పార్టీ అభ్యర్థి పోటీ చేయనుండటం సంతోషాన్ని కలిగిస్తోంది. పార్టీ శ్రేణులంతా ప్రస్తుతం డీఎంకే అభ్యర్థి గెలుపుకోసం అప్పుడే ప్రచారం కూడా ప్రారంభించారు. అదే విధంగా ఈ నియోజకవర్గం ఎన్నికల పనులన్నింటినీ ముగ్గురు మంత్రులకు అప్పగించడంతో డీఎంకే అభ్యర్థి సులువుగా గెలుస్తారు.

తెన్‌కాశిలో బీజేపీ అభ్యర్థుల పోస్టర్ల యుద్ధం



తెన్‌కాశిలో బీజేపీ తరఫున పోటీ చేయనున్న ఆనందన్, జాన్ పాండ్యన్ వేర్వేరుగా అంటించిన పోస్టర్లు

ప్యారీస్, మార్చి 19: తెన్‌కాశి లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితా విడుదల కాకముందే సీటు కోసం దరఖాస్తు సమర్పించిన ఆశావహులు పోస్టర్ల యుద్ధం ప్రారంభించారు. ఈ నియోజకవర్గంలో బీజేపీ తరఫున ఆ పార్టీ స్టార్టప్ విభాగం అధ్యక్షుడు ఆనందన్ అయ్యాస్వామికి సీటు దక్కే అవకాశముంది. ఆయన గత ఏడాదికి పైగా ఆ నియోజకవర్గంలో మకాం వేసి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి బీజేపీ పటిష్ట పరిచే చర్యలు చేపట్టారు. మరోవైపు బీజేపీ కూటమిలో చేరిన తమిళగ మక్కల్ మున్నేట్ర కళగం అధ్యక్షుడు జాన్ పాండ్యన్, తనకు తెన్‌కాశి సీటు కేటాయించాలంటూ బీజేపీ అధిష్ఠానాన్ని కోరుతున్నాడు. ఇదిలా ఉండగా, ఒకట్రెండు రోజుల్లో బీజేపీ అభ్యర్థుల జాబితా విడుదల కానుండగా, అంతకు ముందే ఆనందన్ అయ్యాస్వామి, జాన్ పాండ్యన్ వేర్వేరుగా పోస్టర్లు అంటించి కమలం గుర్తుపై ఓటు వేసి అభ్యర్థిగా గెలిపించాలంటూ ప్రచారం ప్రారంభించడం గమనార్హం..

● బయోడేటా

సీపీఐ అభ్యర్థులు వీరే



ఐసిఎఫ్, మార్చి 19: డీఎంకే కూటమిలో ఉన్న సీపీఐ తరఫున తిరుప్పూర్ లోక్‌సభ నియోజకవర్గంలో మళ్లీ సుబ్బరాయన్, నాగపట్టినం నియోజకవర్గంలో పార్టీ జిల్లా కార్యదర్శి సెల్వరాజ్ పోటీ చేయనున్నారు.

పేరు: సుబ్బరాయన్, **వయస్సు:** 77 సంవత్సరాలు
పుట్టిన తేది: 10.8.1947, **వృత్తి:** పార్టీ ఫుల్ టైం కార్యకర్త
స్వగ్రామం: తిరుప్పూర్

తన 20 ఏళ్ల ప్రాయంలో సీపీఐలో చేరిన సుబ్బరాయన్ ఇప్పటివరకు ఫుల్ టైం పార్టీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యక్షుడు, సీపీఐ కోయంబత్తూర్ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, జాతీయ కమిటీ సభ్యుడు ఇలా పార్టీ వివిధ బాధ్యతల్లో ఉన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం తిరుప్పూర్ ఎంపీగా ఉన్నారు. ఆయన భార్య మణిమేఘలై, ఒక కుమారుడు ఉన్నారు.



పేరు: సెల్వరాజ్, **వయస్సు:** 62
విద్యార్హత: ఎంఏ, ఎంఫిల్
వృత్తి: పార్టీ ఫుల్ టైం కార్యకర్త
స్వగ్రామం: మన్నార్‌గుడి యూనియన్, కీళనాలానల్లూర్

1980 నుంచి సీపీఐ ఫుల్ టైం కార్యకర్తగా ఉంటున్నారు. పార్టీ మన్నార్‌గుడి యూనియన్ కార్యదర్శిగా 12 ఏళ్లున్నారు. తిరువారూర్ జిల్లా పంచాయతీ అధ్యక్షత పదవి చేపట్టారు. ఢిల్లీలో జరిగిన పంచాయతీరాజ్ మహానాడులో రాష్ట్రపతి, ప్రధానమంత్రి సమక్షంలో స్థానిక సంస్థల అధికారం గురించి ప్రసంగించిన వ్యక్తి. ప్రస్తుతం పార్టీ తిరువారూర్ జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. భార్య జీవరేఖ, న్యాయశాఖలో పనిచేస్తున్నారు. కుమార్తె వెన్బా న్యాయవాది. కాగా, కుమారుడు నన్బా కళాశాలలో చదువుతున్నాడు.



సమత్తువ మక్కల్ కళగం అభ్యర్థులను పరిచయం చేస్తున్న ఫ్రంట్ రాష్ట్ర ఆర్గనైజర్ మామల్లన్

సమత్తువ మక్కల్ ఫ్రంట్ అభ్యర్థుల పరిచయం

ప్యారీస్, మార్చి 19: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని రాష్ట్రంలో ఎస్సీ, ముస్లిం, క్రైస్తవ సంస్థల కలయికతో మరో కొత్త ఫ్రంట్ సమత్తువ మక్కల్ కళగం (ఎస్ఎంకే) పేరుతో ఆవిర్భవించింది. బాబా సాహెబ్ అంబేడ్కర్, డాక్టర్ ఖాయిదేమిల్లత్, రెట్టమల శ్రీనివాసన్ తదితర నేతల స్ఫూర్తితో మతవాద బీజేపీ, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ద్రావిడ పార్టీలకు వ్యతిరేకంగా ఫ్రంట్ తరఫున 40 నియోజకవర్గాల్లో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. ఈ మేరకు చేపాక్కంలోని చెన్నై పాత్రికేయుల సంఘంలో మంగళవారం ఉదయం ఫ్రంట్ రాష్ట్ర ఆర్గనైజర్, ఆలిండియా అంబేడ్కర్ మక్కల్ కళగం అధ్యక్షుడు ఆర్.మామల్లన్, రెవ.ఆర్.దేవరత్నం, ఎం.కమలకన్నన్, ఎస్ఎంకే మహమ్మద్ హమీం, ముత్తుస్వామి పరయనార్ మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా 13 మందితో అభ్యర్థులను ప్రకటించారు. సెంట్రల్ చెన్నైలో అబిత్ బాషిక్ హుస్సేన్, చెంగల్పట్టులో మామల్లన్, తిరువళ్లూర్ నియోజకవర్గాల్లో మత్యాస్ పోటీ చేయనున్నట్లు తెలిపారు.

శివకాశిలో జోరుగా
పార్టీ జెండాలు, గుర్తులు, తోరణాల తయారీ

పెరంబూర్, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల తేది ప్రకటించిన నేపథ్యంలో విరుదునగర్ జిల్లా శివకాశిలో పార్టీ జెండాలు, చిహ్నాలు, తోరణాల తయారీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. శివకాశి బాణసంచా, అగ్గి పెట్టెల తయారీ మాత్రమే కాకుండా, ప్రింటింగ్ రంగంలో కూడా పేరుగాంచింది. లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19వ తేది జరగనుండడంతో, ప్రతి పార్టీ తమ బహిరంగ సభలు, వీధి ప్రచారాలు చేపట్టనున్నాయి. అందువల్ల పార్టీ జెండాలు, గుర్తులు, నేతల చిత్రపటాలు, బ్యాడ్జీలు, తోరణాలు, టోపీలు, పార్టీ గుర్తుతో కూడిన టీ-షర్ట్‌లు, చీరలు, ధోవతులు, మఫ్లర్లు తయారీకి ఈ ప్రాంతంలోని ప్రింటింగ్ ప్రెస్‌లు ఆర్డర్లు చేపట్టాయి. ఎన్నికల సందర్భంగా కూటమిలో ఏర్పాటులో పార్టీలు బిజీగా ఉండగా, మరోవైపు ప్రచారానికి అవసరమైన జెండాలు, గుర్తుల కోసం శివకాశికి బారులు తీరుతున్నారు. దీంతో, ఎన్నికలు ముగిసే వరకు శివకాశిలో వీటి విక్రయాలు జోరుగా కొనసాగనున్నాయని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పేర్కొంటున్నారు.



→ పార్టీల తోరణాల తయారీలో మహిళలు



నేతల చిత్రాలు, గుర్తులతో ఏర్పాటవుతున్న బాడ్జీలు

యూట్యూబ్ చానెళ్లపై రూ.5 కోట్లకు పరువునష్టం దావా

● నిర్మాత అబ్దుల్ మాలిక్ బిన్ దస్తగిర్

మాదకద్రవ్య అక్రమ రవాణాతో సంబంధం ఉన్నట్టు అసత్య వార్తలను ప్రసారం చేసిన కొన్ని యూట్యూబ్ చానెళ్లపై రూ.5 కోట్లకు పరువునష్టం దావా వేయనున్నట్టు మలేసియా పారిశ్రామికవేత్త, సినీ నిర్మాత అబ్దుల్ మాలిక్ బిన్ దస్తగిర్ వెల్లడించారు. ఈ విషయంపై ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడుతూ... మాలిక్ స్ట్రీమ్స్ కార్పొరేషన్ పేరుతో అనేక కంపెనీలను నడుపుతూ పలువురికి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నా. అనాథలను అక్కున చేర్చుకుని పోషిస్తున్నా. పలు తమిళ చిత్రాలకు అసోసియేట్ నిర్మాతగా వ్యవహరించా. తమిళ చిత్రాలను మలేసియాలో డిస్ట్రిబ్యూట్ చేస్తున్నా. సామాజిక సేవ చేస్తూ గౌరవ మర్యాదలతో జీవిస్తున్నా. నా సేవలకు గుర్తింపుగా మలేసియా ప్రభుత్వం ప్రదానం చేసే అత్యున్నత పురస్కారమైన 'డత్తో' అందుకున్నా. అంతర్జాతీయ స్థాయిలో 'మాస్టర్ క్లాస్ ఎంటర్‌ప్రెన్యూర్'గా అవార్డును స్వీకరించా. అలాంటి నాపై ఇటీవల కొన్ని యూట్యూబ్ చానెల్స్ డ్రగ్స్ ముఠాతో సంబంధాలు ఉన్నాయని, మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తున్నట్టు కథనాలను ప్రసారం చేశాయి. ఇలాంటి వాటిలో తమిళ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, మాధేష్ వారాహి, సౌక్కు శంకర్‌తో పాటు మరికొన్ని యూట్యూబ్ నిర్వాహకులపై నగర పోలీస్ కమిషనర్‌కు ఈ నెల 18న ఫిర్యాదు చేశా. అలాగే, నాకు అపకీర్తిని తెచ్చిపెట్టేలా అసత్య కథనాలు ప్రసారం చేసిన యూట్యూబ్ చానెళ్ళు తక్షణం బహిరంగంగా బేషరతు క్షమాపణలు చెప్పాలి. అసత్య కథనాలను యూట్యూబ్ చానెళ్ళ నుంచి తొలగించాలి. లేనిపక్షంలో రూ.5 కోట్లకు పరువునష్టం దావా వేస్తా. నా వ్యక్తిగత వృద్ధిని జీర్ణించుకోలేని కొందరు ఈ తరహా ప్రచారం చేస్తున్నారు' అని ఆయన వివరించారు. కాగా, ఢిల్లీలో రూ.2 వేల కోట్ల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్న కేసులో తమిళ సినీ నిర్మాత జాఫర్ సాదిక్‌ను ఢిల్లీ నార్కోటిక్ విభాగం పోలీసులు అరెస్టు చేసిన విషయం తెల్సిందే.



విలేకరులతో మాట్లాడుతున్న అబ్దుల్ మాలిక్ తదితరులు

నేడు ఇళయరాజా బయోపిక్‌పై అధికారిక ప్రకటన

చిత్రజ్యోతి

'ఇసైజ్ఞాని' ఇళయరాజా జీవితచరిత్ర ఆధారంగా ఒక చిత్రం రూపుదిద్దుకోనుంది. ఇందులో హీరో ధనుష్ హీరోగా నటించనున్నట్టు సమాచారం. ఈ ప్రాజెక్టుపై బుధవారం అధికారికంగా ప్రకటించనున్నారు. 47 యేళ్లుగా తన సంగీతంతో సినీ ప్రేక్షకులను, శ్రోతలను ఉర్రూతలూగిస్తున్న ఇళయరాజా.. ఇప్పటివరకు సుమారుగా 1400కు పైగా చిత్రాల్లో ఏడు వేలకుపైగా పాటలకు సంగీతం అందించారు. అనేక అవార్డులు, రివార్డులు పొందారు. కేంద్రప్రభుత్వం ఇచ్చే పౌర పురస్కారాలైన 'పద్మ భూషణ్', 'పద్మ విభూషణ్' వంటి అత్యున్నత పురస్కారాలను అందుకున్నారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కే బయోపిక్ వివరాలను ఈనెల 20న నగరంలోని ఓ నక్షత్ర హోటల్‌లో జరిగే విలేకరుల సమావేశంలో అధికారికంగా వెల్లడిస్తారు. ఇందులో విశ్వనటుడు కమలహాసన్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. అలాగే, ఇళయరాజా, హీరో ధనుష్ వంటి అనేక మంది సినీ ప్రముఖులు హాజరుకానున్నారు. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే ఈ బయోపిక్ 2025లో ప్రేక్షకుల ముందుకురానుంది.



ఇళయరాజాతో ధనుష్